"కూరలో ఉప్పు లేదు..." ఎన్నోసార్లు విందామె ఆ మాటల్ని తన జీవితంలో. పుట్టింట్లో ఉప్పు తక్కువ తినడం అలవాటు. అదే అలవాటుకొద్దీ ఇక్కడ మరపుగా తక్కువేస్తే ఎవరూ తినరు.

"బతుకులో స్వార్థం లేదు..." ఈ మాటల్ని ఆమెతో ఎవరూ అనలేదు. తనకి తనే అర్థం చేసుకుంది. స్వార్థం లేకపోతే ఏదీ నాదనుకోవడం ఉండదు. నాదనుకోకపోతే ప్రేమా ఉండదు. అప్పుడు జీవితానికి గమ్యంగానీ, అర్థంగానీ ఉండవు. అలాంటి అర్థరహిత మైన జీవితంలో ఎడారిలో వంటరి బాటసారిలా ప్రయాణించి అప్పటికి ఆ చోటుకి చేరుకుంది ఆమె... సుగుణమ్మ.

నారాయణమూర్తి చనిపోయి ఆవేళ్టికి పదకొండో రోజు. వచ్చిన చుట్టాలంతా చాలావరకూ వెళ్లిపోయారు. ముఖ్యమైనవాళ్లు మాత్రం మిగిలారు. వాళ్లంతా హాల్లో కూర్చొని ఒక విషయం మీద తీవ్రంగా చర్చిస్తున్నారు.

నారాయణమూర్తికి ఒక కూతురు, ముగ్గురు కొడుకులు. మొదటి భార్య చనిపోతే సుగుణమ్మని రెండో పెళ్లి చేసుకున్నాడు. సుగుణమ్మకి పిల్లల్లేరు. పిల్లల్లేని కారణాన ఆమె జరిగిన తతంగమంతట్లోనూ అప్రధానంగానే ఉంది. పదో రోజు కార్యక్రమానికి మాత్రమే ఆమె పనికొచ్చింది.


తెల్లటి గ్లాస్గోచీర కట్టుకుని హాలుకి ఆనుకుని ఉన్న చిన్న గదిలో నేల మీద మోచేతిని తలకింద ఉంచుకుని పడుక్కుని ఉంది. నిద్రపోవట్లేదు. హాల్లో జరుగుతున్న చర్చలు తన గురించేనని అర్థమవుతోంది. ఏం జరుగుతుందోనన్న కుతూహలం తప్పించి పెద్దగా బాధేం లేదు ఆమెలో. తనది కాని సంసారాన్ని ఎన్నో ఏళ్లు మోసింది. అవసరానికే తప్ప మరెందుకూ తనని ఎప్పుడూ ప్రేమించని భర్త తాలూకూ వైధవ్యాన్ని ఇప్పుడు మోస్తోంది. ఇంత చేసినా భర్త పోగా మిగిలిన సంసారంలో తనకెక్కడా చోటు కనిపించడం లేదు. అతనిది ప్రైవేటు ఉద్యోగం. పెన్షను రాదు. సంపాదించి మిగిల్చినదీ లేదు. ఆమె ఉనికి అందుకే ప్రశ్నార్థకంగా మారింది. "ఎక్కడుంటుందో ఆవిడనే అడిగితే సరి'' అన్నాడు పెద్దకొడుకు.

"అడగడందాకా ఎందుకు? ఆవిడ పుట్టింటి వైపు మాత్రం ఎవరున్నారు? ఏదేనా ఓల్డేజిహోమ్‌లో చేర్పిద్దాం'' రెండో కొడుకు అన్నాడు.

"ఆవిడ వంటిమీదున్న బంగారం మాటో? ముందూవెనుకా ఆలోచించకుండా అమ్మదంతా ఆమెకే ఇచ్చేశాడు నాన్న'' చిన్నకొడుకు విసుక్కున్నాడు.

"తలో రెండు తులాలేనాగానీ, అది అమ్మ జ్ఞాపకంగా మనకి చెందాలి''

"పెద్దవాళ్లింత తెలివితక్కువ పనులెందుకు చేస్తుంటారో? నలభై యేళ్లొచ్చాక నాన్నెందుకు



రెండో పెళ్లి చేసుకున్నట్టు?''

"ఎప్పుడో జరిగినదాని గురించి ఇప్పుడెందుకు? కృప పెళ్లయ్యాక అంతంత గొడవలొస్తేనే ఇవ్వని మనిషి ఇప్పుడు అడిగితే తీసిస్తుందా? అదంతా అమ్ముకుని బేంకులో వేసుకుని ఆవిడ బతుకు ఆవిడని బతక మందాం.'' పెద్దకొడుకు తీర్మానించాడు. ఇవతలి గదిలో సుగుణమ్మ నిట్టూర్చింది. జరిగిన విషయాలు ఒక్కొక్కటీ గుర్తొస్తున్నాయి.

***


తనకన్నా దాదాపు పదేళ్ల పెద్దవాడిని చేసుకుంది సుగుణమ్మ... కోరీ, వలచీ కాదు... కట్నం ఇవ్వలేక...ఎంతకీ పెళ్లవ్వక... పెద్దవాళ్లు బలవంతపెట్టడంచేత. ఆ పెళ్లిలో నారాయణమూర్తి పెద్ద భార్య నగలు... నగలంటూ పెద్దగా లేవు. రెండు జతల గాజులు, సూత్రాల గొలుసు, నల్లపూసలు, దుద్దులు, ఉంగరం అన్నీ గలిపి పది కాసులదాకా సుగుణమ్మకి పెట్టాడు.

అతను చాలా పెద్దవాడవ్వటం, తను కూడా ముప్పైలో ఉండటం చేత



## బ్రేక్ కోసం పాట్లు...!

మధుశాలిని యాంకరింగ్ చేస్తూ సినిమాల్లోకి వచ్చింది. అయితే ఆమెకి ఇంతదాకా సరైన బ్రేక్ రాలేదు. తాజాగా శివాజి హీరోగా నటిస్తున్న 'స్టేట్‌రౌడీ' సినిమాలో ఆమె హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాలో మధుశాలిని తన అందచందాల ప్రదర్శన కాస్త జోరుగానే చేసిందని టాలీవుడ్ జనాలు చెప్పుకుంటున్నారు. ఈ గ్లామర్ ప్రదర్శనతో అయినా ఆమె కలిసొచ్చి స్టార్ ఇమేజ్ వస్తుందేమో చూద్దాం! బెస్టాఫ్ లక్ మధు!




ఆమె పట్ల శృంగార నాయకుడవ్వలేదు. పైగా కుటుంబ బాధ్యతలు ఆమెకి అతని పట్ల ప్రేమ పుట్టలేదు. ఇకపోతే పిల్లలు. వాళ్లని చూస్తుంటే పుట్టింట్లో తన తమ్ముడూ, చెల్లెలూ గుర్తొచ్చేవారు. అక్కడ వాళ్ల మధ్య తనకి సమానత్వం ఉండేది. ఇక్కడ వీళ్ల మధ్య తనకి స్థానం కనిపించేది కాదు. వాళ్లకి ఈ ఇంట్లో సర్వహక్కులూ ఉండేవి. తల్లిలేని పిల్లలన్న జాలి కూడా పుష్కలంగా లభించేది. ఈ పరిస్థితుల్లో వాళ్లకీ ఆమెకీ మధ్య అనుబంధం కూడా పెరగలేదు. అన్నీ ఒక బాధ్యతగా చేసేది. ప్రేమరహితమైన బతుకు నిస్సారంగా అనిపించేది. అలా ఉండటం దుస్సాధ్యం కాబట్టి తనని తను ప్రేమించుకోవటం అలవాటు చేసుకుంది. తనకి పిల్లల్లేకపోవటం ఆమెని తీవ్రంగా బాధించేది. పెద్దతనంలో ఎలాగన్న భయం అభద్రతాభావంలోకి నెట్టేసేది.

***

సుగుణమ్మతో పెళ్లయిన మూడేళ్లకి నారాయణమూర్తి కూతురి పెళ్లి చేశాడు. ఒక్కగానొక్క కూతురు సుఖపడాలని కొంచెం పెద్ద సంబంధానికే వెళ్లాడు. వాళ్లడిగినవన్నీ ఇచ్చేందుకు తన స్థాయిని కుదించుకున్నాడు.

అక్కడి నుంచీ సుగుణమ్మలో సంఘర్షణ మొదలైంది. ఇబ్బందులు పడటానికా తను రెండో పెళ్లివాడిని చేసుకున్నది? ఉన్నదంతా ఊడ్చి కూతురికే పెట్టేస్తే ముందుముందు ఎలా? భర్తకేదేనా జరిగితే ఆ తర్వాత మిగిలే తనని... చూస్తారా అని మథనపడేది. భర్త ఖర్చులకి అభ్యంతరపెట్టడం ప్రారంభించేసరికి అప్పటిదాకా ఆమెలో తెరమరుగుగా ఉన్న స్వచింతన స్వార్థంగా బహిర్గతమైంది. అందరి దృష్టిలోకీ వచ్చింది.

***

నారాయణమూర్తి కూతురు కృప. ఆ పిల్ల పెళ్లై అత్తవారింటికి వెళ్లినప్పట్నుంచే గొడవలు. మనుషుల్ని వెన్నెముకగల ప్రాణులుగా చెపుతుంది సైన్సు. కానీ వాళ్లలో సగంమంది వెన్నెముక లేని ప్రాణులే. వెన్నెముక అనేది భౌతికంగా కనిపిస్తూనే ఉంటుంది. మనిషి నిటారుగా నిలబడే ఉంటాడు. వ్యక్తిత్వం మాత్రం మరొకరి ప్రభావంలో ఉంటుంది. అందుచేత వ్యక్తిత్వపరంగా కృంగిపోయే ఉంటాడు. అలాంటివాడు కృప భర్త మధు. తల్లి అతని వ్యక్తిత్వానికి వెన్నెముక. ఆవిడెలా చెప్తే అలా. ఎంత చెప్తే అంత.

ముగ్గురు మగపిల్లల మీద ఒక్కర్తే ఆడపిల్ల గాబట్టి పెట్టుపోతలవీ ఘనంగా జరుపుతారని ఆశించి చేసుకున్నాడు మధు, కృపని. అతని అంచనాలకీ, ఆమె తెచ్చినదానికీ మధ్య అగాధమంత వెల్తి ఉండేది. దాన్ని నింపమని ఆమెని వేధించేవాడతను. అతను ఆశించినంత తన పుట్టింట్లో లేదని చెప్పడానికి ఆమెకెలాంటి ఛాన్సూ ఇచ్చేవాడు కాదు. కొట్టేవాడు. కొట్టి పుట్టింటికి పంపించేవాడు. తండ్రి దగ్గర ఏడ్చేది కృప. ఉన్నంతలో ఇచ్చి పంపేవాడతను. మళ్లీ గోడకి కొట్టిన బంతిలా తిరిగొచ్చేది. ఇలా కొంతకాలం సాగాక ఫ్రెష్‌గా బైక్ కోసం ఇండెంటు పెట్టాడు మధు. అప్పటికే డబ్బొచ్చే అన్నిదారులూ మూసుకుపోయాయి నారాయణమూర్తికి. భార్యని బంగారం ఇమ్మని అడిగాడు ఆఖరిదారిగా. "నేనివ్వను.'' కచ్చితంగా చెప్పింది సుగుణమ్మ.

"దాని కాపురం నిలబెట్టు'' అహం విడిచి బతిమాలాడు.

"తుమ్మితే ఊడిపోయే ముక్కు ఉంటే ఎంత? ఊడితే ఎంత? దాన్ని పట్టుకుని ఎంతకాలం తిరగ్గలం?'' అంది.

"ఏదో ఒక్కటి ఇస్తే మళ్లీమళ్లీ అడగనని నామీద వట్టేసి చెప్పారు పిన్నీ!'' కృప ఏడ్చింది. ఐనా ఆమె కరగలేదు.

"అవి మా అమ్మవి. నువ్వేసుకుంటే నీవైపోతాయా?'' నిస్సహాయ కోపంతో బెదిరించింది కృప.

"మీ నాన్న నాకిచ్చాడు.'' నిర్లక్ష్యంగా జవాబిచ్చింది సుగుణమ్మ.

అంతేకాదు. "ఇప్పటికే చాలా పెట్టాం. ఉన్నవన్నీ అమ్ముకున్నాం.

అప్పులూ చేశాం. ఇంకా యింకా తెమ్మంటే ఎక్కడి నుంచీ వస్తుంది? మగపిల్లల చదువులింకా అవ్వలేదు. మా రోజులు వెళ్లాలి'' నారాయణమూర్తి చెప్పలేకపోయిన మాటల్ని తను చెప్పింది.

"నీ పుట్టింటిదేం నాకు తెచ్చి పెట్టడంలేదు కదా పిన్నీ? మా అమ్మవి వేసుకుని తిరగడానికి నీకెంత సిగ్గులేదు?... ఇదే మా అమ్మే అయితే అడగకుండానే అవసరం ఎరిగి తీసిచ్చేది. అందుకే సవిత్తల్లి... అంటారు.''

"నలుగురు పిల్లల తండ్రిని, వయసు మీరినవాడిని చేసుకున్నందుకుగాను, మీ అందరికీ చాకిరీ చేసేందుకుగాను పెట్టారు. అంతేగానీ దయాధర్మంగా పెట్టలేదు. నేను స్వతంత్రించి తీసుకోనూ లేదు.'' అనేసింది సుగుణమ్మ కఠినంగా. అలా అనటానికి ఆమేం సంకోచపడలేదు.

పిడికిలి మూసినంత కాలం అందులో ఏముందోనన్న కుతూహలమే ఉంటుంది. నారాయణమూర్తికి భార్య మనసులోని భావాలు కచ్చితంగా తెలీవు. ఆమె తనని గౌరవిస్తోందో లేదో కూడా తెలీని పరిస్థితి. ఆ తెలీనితనం ఆమె మీద అతనికి కొంత పట్టునిచ్చింది. ఇప్పుడా పట్టుజారిపోయింది

అప్పుడున్న పరిస్థితుల్లో ఇల్లు నడవాలంటే పెళ్లవ్వాలి. పెళ్లయితేనే చాలని ఉన్నదేదో పెట్టేశాడు. భార్యే కదా అనుకున్నాడు. మొదటి భార్యకి ప్రత్యామ్నాయం అనుకున్నాడు. మొదటామె ఉన్నప్పుడు ఎన్నోసార్లు వీటిని తాకట్టు పెట్టాడు. ఎప్పుడూ ఎందుకని అడగకుండా తీసిచ్చింది. సుగుణమ్మ కూడా అంతేననుకున్నాడు. కాదని తెలిసేసరికి తల తిరిగిపోయింది.

ఎంత స్వార్థం ఈమెలో? తను మళ్లీ పెళ్లిచేసుకుని పిల్లలకి అన్యాయం చేశాడా? మధుకి సమాధానం చెప్పలేకపోయాను. కృప పుట్టింట్లోనే ఉండిపోయింది. మధు మరో పెళ్లి చేసుకున్నాడు. కృపకింక మరో మార్గం లేక కంప్యూటర్ నేర్చుకుని డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా ఒక చిన్న సంస్థలో చేరింది. రెండు మూడు కంపెనీలు మారినా అదే వృత్తిలో స్థిరపడిపోయింది.

***

"పిన్ని విషయంలో తర్జనభర్జన అనవసరం. ఆమెని నేను తీసుకెళ్లి నా దగ్గిరుంచుకుంటాను'' అన్నదమ్ముల తర్జనభర్జనల మధ్య మంద్రస్థాయిలోనే అయినా స్థిరంగా కృప గొంతు వినిపించి ఉలిక్కిపడి ఆలోచనల్లోంచే తేరుకుంది సుగుణమ్మ.

"పిన్ని నాకు మంచే చేసిందో, చెడే చేసిందో! ఆ రోజున ఆవిడ బంగారం అమ్మి ఆ డబ్బు తీసుకుని వెళ్లి ఉంటే ఈ రోజుని ఇలా ఉండేదాన్ని కాదు. ఇంక డబ్బు రాదని తెలిసి బావ నన్నేదైనా చేసినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఆవిడది స్వార్థమే కావచ్చు... అందులోంచే నన్ను నేను ప్రేమించుకోవడం నేర్చుకున్నాను. నాకంటూ ఒక ఉద్యోగం, సంపాదనా...'' అంది కృప.

"అందుకని ఆవిడని దగ్గిరుంచుకోవడం దేనికే? నీకిలా జరిగిందని ఏరోజైనా బాధపడిందా ఆ మనిషి?''

"పోన్లేరా, పెద్దది. నాకూ ఓ తోడు కావాలి.''

"తోడు కోసమని చచ్చేదాకా ఆవిడ భారం మోస్తావా?''

అప్పుడు కలుగజేసుకుంది సుగుణమ్మ.

"మీ అమ్మగారు నా స్థానంలో ఉండి నేను చేసినట్టే చేసి ఉంటే అప్పుడు కూడా ఇలాగే అనేవారా బాబూ?'' మెత్తగా అడిగింది.

అప్పటిదాకా ఆమెని గమనించని వాళ్లంతా కంగారుపడి సర్దుకున్నారు.

"కృప కోసమని నా వంటిమీదివి తీసివ్వలేదని మీకందరికీ కోపంగా ఉంది. కాదనను. ఆ విషయం మన కుటుంబం వరకే తెలుసు. ఇక్కడ ఇంతమంది పెద్దవాళ్లున్నారు. వాళ్లలో ఒక్కరేనా ఈ చర్య తప్పని చెప్పారా? చెప్పలేదు. చెప్పరు. ఎందుకంటే సవిత్తల్లిని కాబట్టి. ఇలాంటి రోజు వస్తుందని నాకు తెలుసు. అందుకే నా జాగ్రత్తలో నేనున్నాను.'' అంది.

"నువ్వు నాకు మంచే చేశావు పిన్నీ! ఆలస్యంగానేనా ఆ విషయాన్ని గుర్తించాను. నాకు నీమీద ఎలాంటి కోపం లేదు. నాతో తీసుకెళ్తాను'' అందర్లోకీ ముందుగా తేరుకుని అంది కృప. ఆ అనటంలో ఎలాంటి ఆరాటం లేదు. కృతజ్ఞత, ఆర్తిలాంటి భావాల్లేవు. తండ్రికీ తద్వారా తమకీ ఆమె తమకి కావల్సిన వ్యక్తి అనే మమకారం లేదు. తమ కుటుంబానికి ఆమె ఎంతో కొంత చేసి, తల్లి పోయాక చెదిరిపోకుండా నిలబెట్టిందన్న ఆప్తభావం కూడా లేదు. ఆమెకోదారి చూపిస్తున్నానన్న ధోరణిలో అంది. అంతే!

"నేనెవరి దగ్గిరకీ రాను. నా వంట్లో ఇంకా ఓపికుంది. పదిమంది పిల్లల్ని చేరదీసి బేబీ సెంటరు పెట్టుకున్నా బతకగలను. మిమ్మల్ని నలుగుర్నీ అక్కడ మా తమ్ముణ్నీ చెల్లెల్నీ పెంచిన అనుభవం ఉంది. చాలు. మీకు చిన్నతనం అనిపిస్తే నేను మీ మనిషినని చెప్పుకోకండి'' అంది సుగుణమ్మ.


కొద్ది రోజులు బలవంతం పెట్టి తనతో తీసుకెళ్లింది కృప. ఆ తర్వాత వచ్చేసింది సుగుణమ్మ. ఆ తర్వాత ఆమె బ్రతుకు ఆమెదైంది.

★

## తెలుసుకుంటే తప్పులేదు...

☛ మొట్టమొదటి టీవీ కార్యక్రమం 1936లో ప్రసారమైంది. అప్పుడు కేవలం ఒక వంద టీవీ సెట్లు మాత్రమే ఉండేవి!

☛ చీమలకు నిద్రంటే ఏమిటో తెలియదు. తిండి లేకుండా వంద



రోజులు అవి జీవించగలుగుతాయి!

☛ ప్రతీ సంవత్సరం భూమిమీద 35వేల టన్నుల కాస్మిక్ డస్ట్ పడుతున్నది!

-శ్రేష్ఠ శ్రీరామ్

